# వసుంధర

# నకిలీ ముత్యాలు



చిప్పలోన పడిన చినుకు ముత్యం అవుతుంది. మామూలు సంఘటన కథ అవుతుంది. అయితే అన్ని కథలూ మంచి రచయిత మనసులో చోటుచేసుకున్న ముత్యాలు కావు.

ముత్యాల నేరడం ఒక కళ, వ్యాపారం. కథల విషయమూ అంతే!

సరైనవాణ్ణి ఎన్నుదోకపోతే మంచి ముత్యాలు కొన్ని ఏరబడకపోవచ్చు. కానీ అందువల్ల ముత్యానికి కలిగే నష్టం కంటె— వ్యాపారికీ, అతని కస్టమర్నుకీ నష్టం!

ముత్యానికి గుర్తింపు అవసరం. ఎక్కడో సముద్రంలో ముత్యపుచిప్పలో ఉన్నంతకాలం దాని ఉనికికి గౌరవం లేదు. అది బంగారంతోనో, వెండితోనో కలిసి మనుషులకూ, దేవుడి బొమ్మలకూ అలంకారం అయినప్పుడే దాని ఉనికికి గుర్తింపూ, గౌరవమూ లభిస్తాయి. ముత్యం కోరుకునేది ఈ గుర్తింపు మాత్రమే!

అయితే ముత్యాలవ్యాపారి పేరంతా అతడు అమ్మే మంచి ముత్యాల మీదనే ఉంటుంది. సౌందర్యోపాసకుల అభిరుచి గొప్పతనం వారెన్నుకున్న ముత్యాలపైనే ఉంటుంది.

మనకున్న ప్రతికా సంపాదకులు ముత్యాల వ్యాపారులవంటి వారనీ, మన పాఠకులు మంచి ముత్యాలకోసం అన్వేషించే సౌందర్యోపాసకులనీ నా నమ్మకం.

అన్నట్లు నేను రచయితని. ఇంతో అంతో పేరున్న రచయితని. ఎందరో ప్రముఖరచయితలున్న ఈ రోజుల్లో నా పేరును చూసికాక నా రచనల విశిష్టతను గుర్తించి ఆదరించిన ప్రతికాసంపాదకుల కారణంగానే నేనూ ప్రముఖరచయిత నయ్యాను. అందుకే ప్రతికా సంపాదకులు పేరుకే ప్రాముఖ్యత నిస్తారంటే నమ్మనివాళ్ళలో నేను ప్రథముణ్ణి.

ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే....

మా ఎదురిల్లు కాళీ అయింది. అందులోకి కొత్తగా ఎవరో ఆఫీసరుగారు వస్తున్నారని తెలిసింది. ఆయనకో అమ్మాయీ, ఇద్దరబ్బాయిలూ ఉన్నారని కూడా తెలిసింది. అమ్మాయిది పదహారేళ్ళ వయసు అని తెలియడం నా ఉత్సాహాన్ని యింకా పెంచింది.

పట్టుమని పాతికేళ్ళైనా లేని నేను రచయితగా మంచి పేరు తెచ్చుకున్నా— మనిషిగాచాలా సామాన్యుణ్ణి. ఇంకా పెళ్ళి కాకపోవడంవల్ల నా మనసు అందమైన అమ్మాయిల గురించి కలలు కంటూ ఊహలోకాల్లో తేలుతుండడం కద్దు.

ఎదురింట్లో ఇదివరకు ఓ ముప్పై ఏళ్ళ గవర్నమెంటుద్యోగి ఉండేవాడు. ఆయన పిల్లలిద్దరూ ఆడవాళ్ళే కానీ ఒక్కరికీ వయసు పది దాటలేదు. ఆయన భార్యకు పాతికేళ్ళుంటాయి కానీ యాభై ఏళ్ళ ముసలమ్మలా మాట్లాడుతుంది. నా రచనల్ని ఆడవాళ్ళు చదివి మెచ్చుకుంటే వినాలన్నది నా కోరిక. ఇప్పుడు ఎదురింట్లోకి పదహారేళ్ళ అమ్మాయి వస్తోందని తెలియగానే నాకు చాలా ఉత్సాహం వచ్చింది.

ఎదురింటివాళ్ళు రానేవచ్చారు.

అమ్మాయి పేరు సత్యవతి. మనిషి నే నూహించిన కంటే అందంగా ఉంది.

కానీ నేను రచయితనని తెలిసినా కూడా ఆమె నన్ను కలుసుకుని మాట్లాడడానికి చాలారోజుల వరకూ ప్రయత్నించలేదు. అయినా మా పరిచయం జరక్కపోలేదు.

ఒకరోజు క్రికెట్ కామెంటరీ వింటూంటే వచ్చిందామె.

ఆ రోజు కరెంట్ లేదు. బ్యాటరీతో పనిచేసే ట్రాన్సిస్టర్ పాడయింది. అందుకని ఆమె క్రికెట్ కామెంటరీ వినడం కోసం వచ్చింది. ఆమె క్రికెట్ ఫాన్!

క్రికెట్ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకోకుండా ఉండడం కష్టం!

అందులోనూ ఆ రోజింకా శుభదినం! మొదటి టెస్టు మ్యాచి ఆడుతూ ఫస్టిన్నింగ్స్‌లో సున్నా కొట్టిన విశ్వనాథ్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు.

సత్యవతి ఎగిరి గంతేసినంత పని చేసింది.

"విశ్వనాథ్ ఇంతపనీ చేస్తాడని నాకు తెలుసు–" అన్నాను. అంతకు ముందు రంజీట్రోఫీల్లో అతనెలా ఆడాడో ఆమెకు వివరాలు చెప్పాను.

"నీకు క్రికెట్ గురించి ఇంత తెలుసా?" అందామె ఆశ్చర్యంగా.

"అందులో ఆశ్చర్య మేముంది?" అన్నాను.

"కథ వ్రాసేవాళ్ళ గురించి నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. ఒక్కటీ మంచిది కాదు–" అందామె.

నేను కాస్త దెబ్బతిని– "అందుకు కారణం?" అన్నాను.

"మన కథలే!"

"అవేంచేశాయి!" అన్నాను.

"అవన్నీ వట్టి ట్రాష్!" అంది సత్యవతి.

ఒక అందమైన అమ్మాయి కథల గురించి – అందులోనూ ఓ రచయిత దగ్గర అలా అనడం నా కెంతో బాధని పించింది. అందుకే ఈ విషయాన్ని వదలదల్చుకోలేదు. వాదనకు దిగాను.

ఆమె చాలా నిర్మొహమాటస్థురాలులా ఉంది.

తెలుగుదేశంలో ఇంతవరకూ మంచి రచయితలు పుట్టనేలేదుట. మంచి కథ అనిపించుకోదగ్గది మచ్చుకైనా ఒక్కటి లేదుట. అలాగని ఆమెకు కథలంటే అసహ్యం లేదుట. ఇంగ్లీషు కథలూ, బెంగాలీ రచనల తెలుగు అనువాదాలూ మాత్రం చదువుతుందిట. తొలినుంచీ ఆమెది కాన్వెంటు చదువే అయినా మాతృభాషాభిమానంతో ఆమె తండ్రి ఆమెకు తెలుగుకూడా నేర్పాడు ఇంట్లో.

"వెధవ తెలుగు – ఎందుకు నేర్చుకున్నానా అని బాధపడుతున్నాను. అది తెలియడంవల్లనే అలా అప్పుడప్పుడైనా

అన్ని చెత్తకథలు చదవాల్సి వస్తోంది!" అని వాపోయిందామె.

"ఇంతవరకూ తెలుగులో ఎన్ని కథలు చదివారు?" అనడిగాను.

"రెండు...." అందామె.

కానీ వాళ్ళ నాన్నగారు కథలు తరచుగా చదువుతుంటారుట. చదివి వాటి సారాంశం చెబుతుంటారుట. ఆయనకూ తెలుగు కథలంటే అసహ్యమే కానీ కాలక్షేపంకోసం తప్పనిసరై చదువుతారుట. ఆ మాటకొస్తే వాళ్ళింట్లో చాలా పత్రికలు కొంటారు, సత్యవతి వాటిలో సినిమా కబుర్లూ, విజ్ఞాన విశేషాలూ చదువుతుందట. కథలకు వేసిన బొమ్మల్నిబట్టే ఆమె అవెంత చెత్త కథలో ఊహించ గలదుట.

"తెలుగువాళ్ళు నిజంగా గొప్పవాళ్ళు. తనవాళ్ళని విమర్శించడంలో వారికి వారే సాటి!" అన్నాను నేను. రెండే రెండు కథలు చదివి తెలుగు కథలన్నీ చెత్తవే అనగలిగిన పదహారేళ్ళ అమ్మాయి, ఆ అభిప్రాయాలకు నీరుపోసి పెంచేతండ్రీ .. మనదేశంలో తరచుగా ఎదురుపడే వ్యక్తులే!

సత్యవతిని నేను నా కథలపై అభిప్రాయం అడగలేదు. ముంజేతి కంకణానికి అర్దమేల?

సత్యవతితో పరిచయమైన వారంరోజులకు నాకు అమె అన్న రామ్మోహన్ పరిచయం లభించింది. అతను కాస్త ఆలస్యంగా ఎదురింట్లోకి వచ్చాడు. అతడి వయస్సు ఇరవై రెండేళ్ళుంటుంది.

నాతో పరిచయం చేసుకుంటూనే రామ్మోహన్ నా రచనల్ని పొగిడాడు. సత్యవతి అన్న నా రచనల్ని పొగడడం నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

కాసేపు కబుర్లయ్యాక- "నా రచనల్లో మీకు ఏది బాగా నచ్చింది?" అనడిగాను.

"అన్నీ!" అన్నాడతను.

ఇలాంటి సమాధానమంటే నాకు భయం. ఇది రాజకీయాలకు సంబంధించిన సమాధానం. ఈ సమాధానం వచ్చినపుడు అవతలి మనిషి నా ఒక్క రచన కూడా చదవకపోయినా ఆశ్చర్యంలేదు. పైగా నానుంచి ఏదో ప్రయోజనం ఆశిస్తూ కూడా ఉండవచ్చు.

అది నిజమేనని తేలింది.

మర్నాడు రామ్మోహన్ ఒక సంచీ తీసుకుని వచ్చాడు. మౌనంగా నాకు అందించాడు.

సంచీ చాలా బరువుగా ఉంది!

"చూడండి!" అన్నాడతను.

చూశాను. సంచీలో కథలున్నాయి. సంచీని బరువెక్కించినవి అవే!

ఆ కథలన్నీ రామ్మోహనే రాశాడు.

"చదివి మీ అభిప్రాయం చెప్పాలి!" అన్నాడతను.

ఓ నవరచయితను కలుసుకున్నందుకు నాకు చాలా ఆనందం కలిగింది. ఆ రోజంతా కష్టపడి చదివాను. చదువు

తూండగానే నాకు తెలిసిపోయింది - రచయితగా అతడు చాలా ప్రాథమిక దశలో ఉన్నాడని!

అయితే నా అభిప్రాయాన్ని చెప్పకుండా రచనలు బాగున్నవనే చెప్పాను. ఆ మర్నాడు రామ్మోహన్ మా ఇంటికి ఓ ట్రంకుపెట్టి మోసుకుని వచ్చాడు. దాంట్లోనూ అతడి రచనలే ఉన్నాయి.

అవన్నీ చదివి నేను రామ్మోహన్‌కి అభిప్రాయం చెప్పాలట!

ఈసారి నేను అన్నీ చదవలేదు. ఇష్టంవచ్చినట్లు శాంప్లింగ్‌చేసి కొన్ని చదివేక అన్నీ చదవక్కర్లేదని నిర్ణయించుకున్నాను. మర్యాదకు ఓ వారంరోజులు ఆగి అతడి ట్రంకుపెట్టి తీసుకోవచ్చునని చెప్పాను.

"కథలెలా ఉన్నాయి?"

"బాగున్నాయి!"

"మీరోసారి మా యింటికి రావాలి!" అన్నాడతను.

వెళ్ళాను. అతను తిన్నగా తనగదిలోకి తీసుకువెళ్ళాడు. గదిలో బీరువా కనబడగానే నాకు భయంవేసింది.

ముందు సంచీ, తరువాత ట్రంకుపెట్టీ, ఇప్పుడు....

నా అనుమానం వృధాకాలేదు. రామ్మోహన్ బీరువా తెరిచాడు. అతడి కథలతో అది నిండిపోయి ఉంది.

"మీ కథలు చాలా బాగుంటున్నాయి. సమయం చిక్కకపోవడంవల్ల తప్పితే ఈ బీరువా మా ఇంటికి తీసుకుపోయి ఇందులోని కథలన్నీ చదివి వుండేవాణ్ణి!" అనేశాను ముందు జాగ్రత్తకోసం.

"ఓ విశేషం చెప్పనా?" అన్నాడు రామ్మోహన్.

"చెప్పండి!"

"ఇన్ని మంచికథలు రాశాను? వీటిలో ఒక్కటికూడా ప్రచురితం కాలేదు. ఇవన్నీకూడా ఏదో పత్రికనుంచి తిరిగొచ్చినవే!" అన్నాడు రామ్మోహన్.

ఆ విషయం అప్పుడే తెలిసినట్లూ, ఏ మాత్రమూహించనట్లూ నటించాను.

"అందు క్కారణం చెప్పమంటారా?" అన్నాడు రామ్మోహన్.


"ఊఁ."

"అంతా మోనోపలీ.... పేరున్నవాళ్ళనితప్ప ఈ సంపాదకులు వేసుకోరు...." అన్నాడు రామ్మోహన్.

ఎవరితోనైనా వాదించబోయేముందు- వాళ్ళు చెప్పినవన్నీ అంగీకరించాలి. ఆ తర్వాత నెమ్మదిగా విషయాన్ని పరిశీలించడానికి యత్నించాలి. ఆ పైన మన పాయింట్ చెప్పాలి, ఆపైన ఎదుటి వ్యక్తిని పూర్తిగా వ్యతిరేకించవచ్చు.

ఈ ప్రయత్నంలోనే నేను రామ్మోహన్‌కి ముత్యాలవ్యాపారి సామ్యం చెప్పాను.

మంచి రచనను కాదంటే నష్టపోయేదెవరు? .... సంపాదకుడే!




ఈ విషయం ఋజువుచేయడంకోసం నేనో సాహసం కూడా చేశాను.

రామ్మోహన్ కథను నా పేరుమీదా, నా కథను రామ్మోహన్ పేరుమీదా ఓ పత్రికకి పంపాం.

రామ్మోహన్ పేరుతో నా కథపడింది. నా పేరుతో వెళ్ళిన అతడి కథ తిరిగి వచ్చింది.

"ఇది కాకతాళీయం కావచ్చు. ఇలాంటి ప్రయోగాలు మరిన్ని పత్రికలలో మరిన్నిసార్లు చేద్దాం !" అన్నాడతను.

నేను రాసిన కథకు నాపేరుతో కాకుండా త్యాగంచేయడం ఒక్కసారికి మించి సాధ్యపడదని అతనికి చెప్పాను.

"నా కథల్లో లోపమేమి టంటారు?" అన్నాడు రామ్మోహన్.

"లోపాలెంచేటంత పెద్దవాణ్ణి కాదు నేను. నా కథ ఎప్పుడైనా తిరిగివచ్చినప్పుడు శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారి కథలు చదువుతాను...." అన్నాను.

"ఆయనెవరు ?"

తృళ్ళిపడ్డాను. నేను కుటుంబరావు గారి అభిమానిని. రచయిత కావాలనుకునే

ప్రతి ఒక్కడూ ఆయన కథలు చదివి తీరాలన్నది నా నమ్మకం.

"మీకు కుటుంబరావుగారు తెలియరా?"

"తెలియరు...."

"పోనీ .... తెలుగుదేశంలో నీకు తెలిసిన ఓ రచయిత పేరు చెప్పండి!"

రామ్మోహన్ కొందరు ఆంగ్ల రచయితల పేర్లు తెలుసుగానీ— తెలుగు రచయితల పేర్లు ఒక్కటీ తెలియదు.

"పత్రికలు చదివేటప్పుడు కథేగానీ— రచయిత పేరు చూడరా?" అన్నాను.

"అసలు నేను కథలు చదివేదే చాలా తక్కువ!" అన్నాడతను. అతనికి తెలుగు చదవడమంటే చిరాకు అట.

"అలాంటప్పుడు తెలుగులో కథలెందుకు రాస్తున్నారు?" అన్నాను.

"వాల్మీకి, వ్యాసుడూ, గుణాఢ్యుడు కథలు రాయడాని కింకొకళ్ళ కథలు చదివేవారేమిటి? నాలో కలిగే భావాలు అక్షరరూపాన్నిచ్చి— నా భావాలను పాఠకులతో పంచుకోవాలన్నది నా అభిలాష. అందులో ఇతరుల కథలు చదవకపోవడం అనర్హత అనుకోను," అన్నాడు రామ్మోహన్.

"ఆదిమానవుడికి నిప్పు తెలియదు. లోహన్నతదెరుగడు. బట్టకట్టేవాడు కాడు. భాష ఎరుగడు. కొన్ని వేలసంవత్సరాల్లో నాగరకత అభివృద్ధిచెంది మనిషి ఇప్పటి వరకు వచ్చాడు. అలాగని అప్పుడే పుట్టిన మనిషిని ఈ నాగరకతకు దూరంగా ఉంచి అడవిలో వదిలిపెట్టి— అన్నీ మొదట్నించీ తనకు తానై నేర్చుకోమని అనడంలేదు. ఇతరులు సాధించిన పునాదిపై మనిషి నూతన హర్మ్యాలు నిర్మించుకుంటూ వెళ్ళిపోతున్నాడు. కథల విషయంలో మీరు ఆదిమానవుడివలె ఉండాలనుకుంటున్నారు...." అన్నాను.

రామ్మోహన్ నవ్వి— "అందువల్ల పెద్ద నష్టమేమీలేదు. ఇప్పటి ఫాషన్లు మళ్ళీ మన్ని ఆదిమానవుల వైపే తరుముతున్నాయి. నాకు నేనై ఏదో ఒకరోజున నలుగురూ గుర్తించేలా సాహిత్యసేవ చేస్తాను...." అన్నాడు.

ఇది జరిగి పదేళ్ళవుతుందేమో!....

ఎనిమిదేళ్ళక్రితమే ఎదురింటి ఆఫీసరు ట్రాన్స్‌ఫరై ఎటో వెళ్ళిపోయాడు.

ఈ పదేళ్ళలోనూ తెలుగుదేశంలో సాహిత్యపరంగా మార్పులు చాలా వచ్చాయి.

పత్రికలు పుంఖానుపుంఖాలుగా పుట్టుకొచ్చాయి. పాఠకుల సంఖ్యతోపాటు రచయితల సంఖ్య కూడా పెరిగింది. నేనైతే ఇప్పుడు కథలేకాక, నవలలు కూడా రాస్తున్నాను. అయితే ప్రతికలకు సంబంధించిన వ్యక్తులతో నాకున్న వ్యక్తిగత పరిచయం అంతంత మాత్రమే కావడం వల్ల— రచయితగా సంపాదించిన పేరును వ్యక్తిగా సంపాదించలేకపోయాను.

ప్రముఖ పత్రికలన్నీ నా రచనలు ప్రచురిస్తున్నాయి— కానీ మూడు సంవత్స

రాలుగా వస్తున్న 'అరుణోదయం-' మాసపత్రిక నాకు కొరకరాని కొయ్యగా తయారైంది.

పత్రిక ప్రారంభించబోయే ముందు కథ గురించి అడుగుతూ నాకో ఉత్తరం వచ్చింది. వెంటనే నేను పంపాను కూడా!

ఆ కథ పత్రికవారు ఆశించినమేరకు లేదనీ మరో కథ పంపమనీ ఉత్తరం వచ్చింది నాకు. కథ కూడా తిరిగివచ్చింది.

ఇంకా పుట్టని పత్రికనుంచి అలా అనిపించుకోవడం చిన్నతనమనిపించి కథలపోటీ స్థాయిలోని కథావస్తువులో ఓ కథ రాసిపంపాను. అయితే ఆ కథకూడా తిరిగి వచ్చింది. నాకు కలిగించిన అసౌకర్యానికి చింతిస్తున్నామని పత్రికా సంపాదకుడు ఉత్తరం రాశాడు. ఈ సారి కథ అడగలేదు.

పత్రిక తొలిసంచిక వచ్చింది. అందులో పేరున్న రచయితల కథలూ, ఓ వర్ధమాన రచయిత్రి సీరియలూ ఉన్నాయి. నాకు కాంప్లిమెంటరీ కాపీ వచ్చింది.

పత్రికల్లో ఒక్క రచన కూడా నాకు నచ్చలేదు. అపత్రిక బ్రతికి బట్టకడుతూం దని నేననుకోలేదు.

కానీ నా అంచనాను తప్పుచేస్తూ ఆ పత్రిక బ్రహ్మాండంగా నిలదొక్కు-కోవడమేకాక సర్క్యులేషన్లో- కొన్ని పాతప్రముఖ పత్రికల్ని అధిగమించింది. అందులో కొత్త సీరియల్ రాస్తున్న వర్ధమాన రచయిత్రి రచనలు ఇతర పత్రికల్లో కూడా రాసాగాయి.

ఆ పత్రికా సంపాదకులకు నాపై ఉన్న గౌరవాభిమానాలకు సూచనగా ప్రతినెలా విధితప్పకుండా- కాంప్లిమెంటరీ కాపీ నాకు అందుతోంది.

సర్క్యులేషన్ అధికంగా ఉన్న పత్రిక కదా, నా రచనను ఎక్కువమంది పాఠకులు చదువుతారు గదా అన్న ఆశతో ఆ పత్రికకు నేను పంపిన ప్రతి కథా తిరిగి వచ్చింది.

ఒకోసారి నాకు ఉక్రోషం వచ్చేది. పౌరుషం కలిగేది.

నాకు పత్రికలపై పక్షపాతం లేదు. కానీ ఈ పత్రిక ప్రచురించే రచన ఎందుకు చేయలేకపోతున్నానన్న బాధతో రాబర్ట్ బ్రూస్, ఘజనీమహ్మద్‌లను మించి ప్రయత్నాలు చేయసాగాను. కానీ ఈ మూడేళ్ళలోనూ ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయాను. నాలోని లోపమేమిటో ఆ పత్రికా సంపాదకుణ్ణి కలుసుకుని అడిగి తెలుసుకోవాలని చాలా సార్లు అనిపించేది. అందుకు అభిమానం అడ్డొచ్చింది.

ఇలా ఉండగా ఒకసారి హైద్రాబాదు వెడుతూంటే అనుకోకుండా ట్రెయిన్లో సత్యవతి కనిపించింది.

చూసిన వెంటనే నే నామెను గుర్తు పట్టలేదు. ఇప్పుడామెది పదహారేళ్ళ వయస్సు కాదు. ఆమెతోపాటు ఇద్దరు

పిల్లలున్నారు. వాళ్ళిద్దరూ ఆమె పిల్లలేనని తెలుస్తోంది. కూడా భర్త వస్తున్నట్లు లేదు.

పాత లెక్కల ప్రకారం ఆమె వయస్సు ఇప్పుడు ఇరవయ్యారో, ఇరవయ్యేడో ఉండాలి. కానీ చూడ్డానికి ముప్పైకి పై బడినదానిలా ఉంది. మనిషి కొస్త లావు అయింది.

ముందు ఆమే నన్ను గుర్తుపట్టి - "మీరు ఫలానా కదూ!" అంది.

అప్పుడు నేనూ ఆమెను గుర్తుపట్టి— "చాలా మారిపోయారు!" అన్నాను!

కాసేపు కబుర్లయ్యాక - "అన్నట్లు మీరింకా రాస్తున్నారా?" అంది.

"ఇంకా ఏం కర్మ- ఎప్పటికీ రాస్తూనే ఉంటాను-" అన్నాను. తర్వాతనెమ్మదిగా- "అయితే ఇప్పటికీ పత్రికలకేసి కన్నెత్తి చూడ్డంలేదన్నమాట-" అన్నాను.

"లేదు. కానీ ఇప్పటి కారణం వేరు...." అందామె.

"ఏమిటో అది?" అన్నాను కుతూహలంగా.

"తీరుబడి ఉండడంలేదు...."

"ఎందుకని?"

"ఇప్పుడు నేనూ రాస్తున్నాను...."

ఎక్కడో బాంబు పేలినట్లులిక్కి పడ్డాను. వర్ధమాన రచయిత్రి విద్యుల్లత ఆమేనని తెలియగానే ఇంకా దెబ్బ తిన్నాను. నెమ్మదిమీద తేరుకుని — "మిమ్మల్ని పాఠకులకు పరిచయంచేసి 'అరుణోదయం' పత్రిక గొప్ప సాహసం చేసిందనుకున్నాను. అది సాహసం కాదని పాఠకులు రుజువుచేశారు...." అన్నాను.

"సాహసంచేసినా ఆశ్చర్యమేముంది? పత్రిక మాదే కదా?" అంది సత్యవతి.

"అంటే?"

"అన్నయ్యే దానికి ఎడిటరు ...." అంది సత్యవతి.

"అలాగా?" అన్నాను. ఆ తర్వాత నాకు నోట మాట రాలేదు. నా బుర్రలోని ఎన్నో అనుమానాలకు సమాధానాలు దొరికాయి.


అంటే రామ్మోహన్ మనసులో నా మీద పగ ఉందన్నమాట! అది పత్రిక పెట్టాక తీర్చుకుంటున్నా దన్నమాట!

"మీ అన్నయ్యనోసారి చూడాలి.... విజయవాడలో జర్నీ బ్రేక్ చేస్తాను!" అన్నాను.

"ఇంటి అడ్రసు ఇమ్మంటారా?" అంది సరస్వతి.

"పత్రిక అడ్రసు నా దగ్గర ఉంది-" అన్నాను.

"ఒకటి కాదు. రెండు కాదు. నాలుగు పత్రికలు నన్ను సీరియల్స్ కావాలని అడుగుతున్నాయి. ఇద్దరు పబ్లిషర్స్ నవల్లు రాసిపెట్టమని చుట్టూ తిరుగు తున్నారు. వంటపని చూసుకుంటూ, పిల్లల్ని సరిదిద్దుకుంటూ- తీరుబడి దొరికి నప్పుడు శక్తికొద్దీ రచనలు చేస్తున్నాను. అందుకే పత్రికలో చూడ్డం కుదరడం




లేదు. నీ రచనలు చదవడమూ అవడం లేదు తీరుబడి ఉన్న రోజుల్లో ట్రాష్ అని భావించి చదవడం మానేశాను. వాటి విలువ తెలిసేక చదవడం కుదరడంలేదు.

"ఆ కథలూ, నీ మెదడూ ఒకరికొకరు ఎప్పటికీ అస్పృశ్యులుగా ఉండడమే మంచిది_" అని మనసులో అనుకుని_ "నీ రచనలు మాత్రం నేడు చదువుతున్నాను...." అన్నాను.

"మీ అభిప్రాయం?"

నా మనసు ఎలాంటి అభిప్రాయాన్ని యిస్తోందో నాకు తెలుసు. అందుకే గదా ఆమె నా రచనలు విలువైనవని అన్నది.

"నా అభిప్రాయం బెజవాడలో దిగేటప్పుడు చెబుతాను...." అన్నాను అభిప్రాయం చెప్పేక ఆమెకు కనబడ్డం నాకిష్టంలేదు.

అందుకే బెజవాడలో బ్రీఫ్‌కేసుతో దిగి_ "తెలుగు సాహిత్యం ట్రాష్ అన్న ఒకనాటి నీ అభిప్రాయంతో పదేళ్ళ తర్వాతనైనా ఏకీభవించ గల్గుతున్నందుకు సంతోషంగా ఉంది. వస్తాను గుడ్‌బై?" అని ఆమె జవాబుకు ఎదురు చూడకుండా పరుగున ప్లాట్‌ఫారం నుంచి బయటపడ్డాను.

స్టేషన్‌నుంచి రిక్షాలో అరుణోదయం కార్యాలయం నేను చేరుకునేసరికి రామ్మోహన్ ఆఫీసులోనే ఉన్నాడు.

నాకు సులభంగానే అతడి దర్శనం లభిం చింది.

రామ్మోహన్ మనిషి కాస్త లావ య్యాడు, మీసాలు పెంచాడు. అతను నన్ను చూస్తూనే గుర్తుపట్టి - "మీ కు త్తరం రాయాలని ఎంతకాలంగానో అనుకుంటు న్నాను. బిజీగా ఉండి కుదరడంలేదు. మా పత్రిక కాంప్లమెంటరీ కాపీ అందు తోందా అనడిగాడు.

"అందుతోంది!" అన్నాను ముభావంగా.

"మరి మా పత్రిక్కి మీ రచనలు పంపడంలేదేం? అవి మీకు నచ్చలేదా?"

"నేను పంపిన ప్రతి కథా మీ పత్రిక నుంచి తిరిగొచ్చింది!" అన్నాను.

రామ్మోహన్ ఆశ్చర్యపోయాడు. అరుణోదయం పత్రికకు కథల సెలక్షన్ పూర్తిగా అతనిదేనట. ఎటొచ్చీ రచయి తల పేరు చూస్తే నిష్పక్షపాతవైఖరి అవలంంభిచడం కష్టమని అతను ప్రతి కథనూ రచయిత ఎవరో తెలుసుకోకుండా చదివి ఎన్నిక చేస్తాడట!

అది నిజంకాదని నాకు తెలుసు. ఎందరో ప్రముఖ రచయితల రచనలు వేస్తూ నా ఒక్కడిపే అతను తిరస్క రిస్తున్నాడు. మా పూర్వపరిచయం అతడికి కలిగించిన అసూయ పగగా మారింది.

ఇప్పుడు నా మనసు తేలికపడింది.

"మీరు నాతో ముత్యాల గురించి చెబుతూండేవారు. అప్పుడే కలిగింది నాలో-ఎడిటర్ కావాలన్న కోర్కె. డబ్బు పోయినా సరే ఓ ప్రయోగం చేయాలను కున్నాను. చాలా మంది రచయితల ప్రాముఖ్యతకు కారణం పత్రికలిచ్చే పబ్లిసిటీయే తప్ప వారి గొప్పతనం కాదని ఋజువుచేయాలన్నది నా పట్టుదల. అందుకే నా కథలన్నీ నా చెల్లెలికిచ్చి నవలలుగా రాయిస్తున్నాను. నేనో నవల ప్రచురించి ఆ నవల గురించి వేలాది పాఠకులు అభినందన లేఖలు రాస్తున్నట్లు ప్రచారం చేశాను. దాంతో ఆ నవల ఎందరినో ఆకర్షించింది. ఇప్పుడు నా చెల్లెలు గొప్ప రచయిత్రి అయి పోయింది...."

"దీన్నిబట్టి మీరు సాధించదల్చుకున్న దేమిటి?"

"ముత్యాల దుకాణంలోకి వచ్చే వారందరికీ ముత్యాల ఎన్నిక తెలియదు. వ్యాపారిపై వారికున్న నమ్మకంమీదనే అంతా ఆధారపడుతుంది. పేరున్న ముత్యాల వ్యాపారి నకిలీ ముత్యాల్ని మంచి ముత్యంగా అమ్మగలడు. డబ్బు లెక్కలేని పత్రికా సంపాదకుడు ఎవరి నైనా రచయితని చేయగలడు .."అన్నాడు రామ్మోహన్.

"అన్నట్లు మీకు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు తెలుసా?" అన్నాను. ఈ ప్రశ్న అడగడంలో నా ఆంతర్యం ఒకనాటి అతడి స్థాయిని గుర్తుచేయడమే!

"తెలియకపోవడమేం- వారి ఫొటో

అక్కడ గోడకు కూడా ఉంది. దానికి పూలమాల కూడా వేశాను...." అన్నాడు రామ్మోహన్ హడావిడిగా.

నేను గమనించలేదు కానీ ఆ గదిలో గోడకు ఒక మూల నా గురుతుల్యుడి ఫొటో ఉంది. అప్రయత్నంగా నేనా ఫొటో వద్దకు వెళ్ళాను ఆయన జీవించి లేరు అనగానే అప్రయత్నంగా నా కనుకొలకుల్లో అశ్రుబిందువులు నిలిచాయి. కానీ అప్పుడే నేను గమనించాను, ఆ ఫొటోకు వేసిన మాల— కాగితపు పూలమాల!

"ఆ మహానుభావుడికి వేసిన పూలమాల ఎన్నడూ వాడిపోకూడదు. అందుకే శాశ్వతంగా ఉండేలా అది వేశాను—" రామ్మోహన్ నేనడక్కుండానే జవాబు ఇస్తూ.

నేను మాట్లాడకుండా వెనక్కు వచ్చాను. మనిషికి లేని శాశ్వతత్వం మాలకిస్తే గొప్ప వ్యక్తిత్వాన్ని గుర్తించడమవుతుందా?

నా కథలను అరుణోదయం పత్రిక తిప్పిపంపినందుకు రామ్మోహన్ చాలా బాధపడ్డాడు. ఇకమీదట కథలను అతడి పేరుకే పంపమని చెప్పాడు.

చదవకుండానే తెలుగు కథలు ట్రాష్ అనే అమ్మాయి తెలుగు పాఠకులు కోరుకునే రచయిత్రి! కథలు రాయడానికి సమకాలీన తెలుగు సాహిత్యంలో పరిచయం అనవసరమని భావిస్తూ, దాని జోలికి వెళ్ళాలని కూడా అనుకోని అబ్బాయి తెలుగు పాఠకుల అభిమాన పత్రికకు ఎడిటర్!

అరుణోదయంలో నా కథ పడాలన్న కోరిక ఇప్పుడు నాకు లేదు.

"ఇప్పుడేం చేస్తున్నారు?" అనడిగానతన్ని.

"శ్రీకుటుంబరావుగారి గొప్పతనం గురించి ఆంధ్రపాఠకులకు సవివరంగా తెలియజేసే వ్యాసమొకటి రాస్తున్నాను." అన్నాడు రామ్మోహన్ గర్వంగా.

"ఆయన ఛాయాచిత్రానికి కాగితపు పూలమాల వేస్తే వేశారు కానీ— ఆయన గురించి వ్యాసం మాత్రం మీరు వ్రాయకండి!" అనేసి అక్కణ్ణుంచి వచ్చేశాను.

